# నాకు నచ్చిన కథ

**గొట్టాపు చలం**

పఠనం వ్యసమైనపుడు వందల కొద్దీ కథలు చదువుతాం. అలాంటప్పుడు "ఒకే ఒక కథ" నచ్చడం బాహుశ, ఎవరి విషయంలోను జరగదేమో? నచ్చేవి పదో, పాతికో ఇంకా ఆపైనో ఉంటాయి. నాకూ అలానచ్చినవి చాలా మంది రచయితలకథలు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నాయి. అయితే ఇన్నింటిలోను మరచి పోకుండా సదా మనసులో నిలిచేది "నచ్చినకథ ఏది?" అని నన్ను నేను ఎప్పుడు ప్రశ్నించు కున్నా ముందుగా ముందుకొచ్చి నిలిచేది రాచకొండ విశ్వనాధశాస్త్రిగారి బాకీ కథల్లోని "తప్పు' కథ.

ఇందులో పేరుపొందిన పెద్దలాయరు చెయ్యితిరిగిన దొడ్డ డాక్టరు ఉంటారు. తమకున్న తెలివితేటలు ఆ భగవంతుడు ప్రసాదించాడనీ వాటినివాడుకోవలసిన వాళ్ళు తగినంత ఖరీదు చెల్లించాలని తమవిద్యకి తామే "రేటు" నిర్ణయించుకుంటారు. పేదోడు నరసయ్య, అన్యాయంగా జైలుకెళ్ళిన తండ్రిని కాపాడమని లాయర్‌ని వేడుకుంటాడు. తనకి తగినంత ఫీజు ఇచ్చుకోలేడని కాదు పొమ్మంటాడు లాయరు.

మరో సందర్భంలో చావు బతుకుల మధ్య ఉన్న తన తల్లిని రక్షించమని డాక్టరు కాళ్ళమీద పడతాడు నరసయ్య. తనకత్తికి తగిన ఖరీదు ఇచ్చుకోలేడని నిర్దయగా నిరాకరిస్తాడు డాక్టరు.

అయితే పరిస్థితులెప్పుడూ ఒక్కలా ఉండవు. సంఘజీవిగా పుట్టిన మనిషి ఎంత సంపన్నుడయినా సాటివాడిసాయం లేకుండ మనలేడు.

అలా..ప్పుడు మిమ్మల్ని నేనెందుకు రక్షించా.. అనుకుంటే?

తను తప్పవేరే దిక్కులేని అలాంటి ఆపద సమయంలో చేయాల్సిన సహాయానికి తనే ఖరీదు నిర్ణయించుకుంటే?

అస్పష్టంగయినా అలాంటి ఆలోచనలు మనసులో మెదిలేసరికి శా! తప్పు" అనుకుంటాడు నరసయ్య. పేదవాడయినా పెద్ద మనసు కలవాడు కాబట్టీ తనపట్ల వాళ్ళు అమానుషంగా ప్రర్తించినా ఆ విషయమే పట్టించుకోకుండా ఆపదనించి ఆదుకుంటాడు.

ఇందులో ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు? ఏదిమానవత్వం? వ్యాపారనాగరికతలో మానవత్వం మన గలుగుతుందా? శ్రమ దోపిడీ మీద ఆధారపడి కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా కలిగిన ఈ వ్యవస్థలో ఏది న్యాయం? ఏది అన్యాయం? •

# "తప్పు"

**రాచకొండ విశ్వనాధశాస్త్రి**

మెత్తం వెయ్యి రూపాయలకి తగ్గించేదేమీ లేదన్నారు శ్రీకంఠరావుగారు. తనకి ఎనిమిదివందలు. తన జూనియర్‌కి రెండు వందలు "ఇష్టమయితే చేయించు కోమను లేకపోతే పొమ్మను. అణాకీ బేడకీ చేసే ప్లీడర్లు చాలా మందున్నారు. ఎవడి దగ్గరకో ఒకడి దగ్గరకు పొమ్మని చెప్పు" అన్నారు శ్రీకంఠరావు గారు.

"చిత్తం అలాగేచెప్తాను" అని హాల్లోంచినడవలోకి వెల్లాడు రావు గారి ముసలిగుమస్తా.

రాత్రి పదిగంటలయ్యింది. హాల్లో నూరు కేండిల్స్ దీపరి బంగారం మండినట్టు మండుతోంది.

దీపం కింద బల్లకి చేరువగా మెత్తని కుర్చీలో కూర్చున్నరావు గారు చేతిలోని కాగితాల కట్టని నిస్సారంగా బల్లమీదకి విసిరిపక్కకి చూసేరు.

పక్కని కుర్చీలో ఓ పదహారేళ్ళ ఆడపిల్ల కూర్చుని ఉంది. సింధీవాళ్ళ షాపులో చీరల అడ్వర్టయిజ్‌మెంటు కోసం పెట్టిన బొమ్మలా ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. ఆమె ఛాయ బంగారపు మెరుగులాగ ఆమెకట్టుకున్న చీర సముద్రనురగలాగ ఉన్నాయి. ఆమె ముఖం వెన్నెల్లా చల్లగా ఉంది. ఆమె కళ్ళు రావుగారి ముఖం వెనుక ఏమి దాగుందో చూడాలనే పరీక్షలో ఉన్నాయి.

"ఏం చిన్నారీ పడుకోకుండ ఇక్కడ కూర్చున్నా వేం? ఎంతరాత్రయ్యిందో తెలుసా?" అని ఆ అమ్మాయిని అడిగారు రావుగారు.

"ఇప్పుడు రాత్రిపదిగంటలయ్యిందని నీకు తెలుసానాన్న? నువ్వింకా భోజనం చెయ్యలేదని కూడా తెలుసా?" అని ఎదురు ప్రశ్నవేసింది చిన్నారి.

ఆమె పేరు శ్రీలక్ష్మి. కాని తండ్రికి మాత్రం ఆమె ఇంకా చిన్నారే. రావుగారు తన కూతురి మాటకి చిరునవ్వునవ్వేరు.

"డబ్బు కావాలంటే పనిచెయ్యాలమ్మా. నీకు పెళ్ళి చెయ్యాలంటే డబ్బు కావాలమ్మ. డబ్బుకోసం మరి నేను కష్టపడాలికదమ్మా? అన్నారు రావుగారు.

రావుగారి కుమార్తె ముఖం రావుగారి మాటలకి ఎర్రబారింది. ఆమె ఏదో అనబోయింది. అంతలో ఆ గదిలోకి ఓ ఇరవై ఏళ్ళ యువకుడు ఓనలభై ఏళ్ళ ఆడమనిషి వచ్చి రావుగారికి నమస్కరించి నిలుచున్నారు. ఆ యువకుడు అందంగా ఉన్నాడనే చెప్పాలి. ఆరోగ్యంగా ఉన్నాడనే చెప్పాలి. పరిశుభ్రంగా లేడని మాత్రం చెప్పాలి. పంచెకట్టుకొని పొట్టిచేతులకబ్బా తొడుక్కుని తలపాగా చుట్టుకొని ఉన్నాడతను. నుదురు విశాలంగా ఉంది. ముక్కు ఎత్తుగా ఉంది. గడ్డం సూదిగా ఉంది. కళ్ళు మెరగ్గా ఉన్నాయి.

చెవుల్ని ఎర్రపాళ్ళ దుద్దులున్నాయి. అతని రంగు కొత్తగాకొని ఇంకా శుభ్రంగా తోమని రాగి బిందె రంగులాగుంది. అతని పక్కన ఉన్న ఆడమనిషి అతని వయసు పంచి, మీసం తీసి, పాగా లాగివేసి ఆడవేషం వేసినట్టుగా ఉంది. అతనికి ఆవిడ అక్కలా ఉంది. అక్కకాదు తల్లని రావుగారికి తనే తెలియచేసాడు. ఆవిడకట్టుకున్న చీరనిండా నలుపుంది. ఆమెకళ్ళనిండా దైన్యముంది. ఆవిడముడుచుకున్న కొప్పు ధూళి, ధూళిగా ఉంది. ఆమెమెళ్ళో ఒక తాడుమాత్రం ఉంది.


ఆవిడ చెవులకి రంధ్రాలు మాత్రం ఉన్నాయి. ఆ చెవితమ్మలు చచ్చిపోయినట్టు వేలాడుతున్నాయి. కంఠంలో ప్రాణమున్నప్పటికీ అందుల్లో మృత్యువుప్రవేశించినట్టుగా

చూపిస్తున్నాయి ఆ తమ్మలు.

వాటిని చూసి రావుగారి కుమార్తె కొంచెం బెదిరింది. ఆమెవళ్ళు జలదరించింది. ఆమె ఆతల్లీకొడుకులవైపు తదేక ద్యానంగా చూస్తూ వాళ్ళు చెప్పేది శ్రద్ధగా వినసాగింది.

వాళ్ళు చాలా దీనావస్థల్లో ఉన్నారట ప్రస్తుతం చాలా కష్ట దశలో ఉన్నారట. అవతలవాళ్ళు చంపడానికి వస్తే ఆ యువకుడు తండ్రి (ఆమెభర్త) వాళ్ళందర్నీ ఆపి ఒక్కడూ నిలబడి దెబ్బలాడేట్ట. అవతల పార్టీలో ఇద్దరు చచ్చిపోకపోతే మిగతావాళ్ళు పారిపోకపోదురట. ఇతడ్ని చంపేద్దురట. వాళ్ళమీద కేసుపెట్టకుండ కనీసం ఆయువకుడి తండ్రిని అప్పటికయినా పంపించకుండా అతనికి తగిలిన దెబ్బలకి కట్టుకూడా కట్టకుండా అరెస్టు చేసి జైల్లో పెట్టించారట పోలీసువాళ్ళు.

"ఏమో! ఏం చేసారో. మీ వాడి మీద పెట్టిన కేసు మాత్రం ఖూనీకేసు. ఖూనీకేసంటే మామూలు న్యూసెన్స్ కేసుకాదు. పావలాకీ అర్థకీ చెయ్యడానికి" అన్నారు రావుగారు. ఆయన చెప్పిందిరైటేనట. వెయ్యి రూపాయిలు అడగడం కూడా న్యాయమే ఓనుకోండి. కాని వాళ్ళు అంతిచ్చుకోలేరట. ొగవు భూమి ఎకరం కాక మరో రెండెకరాల ఎట్టమాత్రం వాళ్ళకి ఉందట. అది అప్పుడు మ్మినా అంత సొమ్మురాదట.



వాళ్ళయందు దయ ఉంచి, వాళ్ళనిచూసి కనికరించి రావుగారు ఓ నాలుగువందలు తీసుకోని ...

వీల్లేదన్నారు రావుగారు. వాళ్ళు ఓ అరగంట బతిమలాడుకున్నారు. ఆ తరువాత వెళ్ళిపోయారు రావుగారి కూతురు రావుగారివైపు చూసింది.

"మళ్ళీ వాళ్ళే వస్తారు" అని ధీమాగా అన్నారు రావుగారు, తనకూతురు కళ్ళల్లోని ఆందోళనచూసి.

॥ అదికాదునాన్న!

॥ఏమిటికాదు తల్లీ.

॥ వాళ్ళు నిజంగా లేనివాళ్ళేనా?"

॥ లేనివాళ్ళులాగానే కనిపిస్తున్నారు॥

"బట్టలేనివాళ్ళని అంతబట్ట రొక్కించి అడగడం తప్పుకద నాన్న"

"తప్పే ! ఏం ఇస్తే ఇస్తారు. ఇవ్వకపోతే ఇంకోడిదగ్గరకిపోతారు.

"నువ్వు తెలివయిన లాయరివి కదాని వచ్చారు కదా? పాపం" అంది శ్రీలక్ష్మి జాలిగా.

"నా తెలివితేటలు వాడుకోవాలంటేనారేటు నాకు ఇవ్వాలమ్మ నేను ఎవరినీ అన్యాయం చెయ్యలేదు. ఎవరి సొమ్ముకూడా నేను పడేసుకోడం లేదు. వాళ్ళకి పనికొచ్చేతెలివి తేటలు నాకు మాత్రం ఇచ్చేడు భగవంతుడు. దానికి నేను ఖరీదు ఇంత అని కట్టి ఉంచాను. అందులో తప్పేముంది చిన్నారి. బజారులో బెనారస్ చీరఖరీదు ఆరువందలు. కొనగలిగితే కొంటావు లేకపోతే ఇంకోచోటికి పోయి ఇంకో చీరకొనుక్కుంటావు అలాగే ఇదీన్నూ' 'అని నవ్వుతూలేచి నిలుచుని "పదభోజనానికి పద'అన్నారు రావుగారు. తండ్రి తెచ్చిన సొమ్మము సరైనది, కాదేమోనని ఎందుచేతనో గాని అనిపించింది శ్రీలక్ష్మికి. కాని తండ్రికి ఆకలిగా ఉండి ఉంటుంది. వాదించడానికి వేళకాదని ఊరుకుని తండ్రివెనక ఇంట్లోకి వెళ్ళింది. రాత్రి పదిన్నరదాటింది.


***

రాత్రిపదిన్నర దాటింది.

డాక్టరు మూర్తిగారు తన (స్వంత) డిస్పెన్సరీనుంచి ఇంటికి వచ్చి వేడినీళ్ల స్నానం చేసి తెలికదుస్తులు తొడుక్కుని టేబులు దగ్గర భోజనానికి కూర్చునే సరికి ఎంత రాత్రయినాసరే ఆయనవచ్చేదాక ఆయన భార్యభోజనం చెయ్యదు. ఆయనకిఎదురుగా కూర్చుని తింటుంది. డైనింగ్ హాల్లో ట్యూబ్‌లైట్ ధగధగలాడుతుంది టేబుల్‌మీద ఆకుపచ్చని ఆయిల్ క్లాత్‌మీద పెట్టిన వెండి గిన్నెలు, గాజుప్లేట్లు తళ తళ మెరుస్తున్నాయి. గిన్నెలమీద మూతలు తీసేసరికి సుఖమయిన భోజనం వాసన మధురంగానిండుకుంది. మూర్తిగారికి ముప్పయ్యేళ్ళు ఉండవచ్చు. ఆయనకి తలమీద వెంట్రుకలు తగ్గుతున్నాయి. కాని వంటి నిండా ప్రొటీన్లు, విటమిన్లు పెరుగుతున్నాయి.

అతను ఎర్రగా నవ్వుతూ బలంగా ఈజీగా ఉన్నాడు. డాక్టరుగారి భార్యకి పాతికేళ్ళు ఉండవచ్చు. ఆవిడ పచ్చగ దబ్బపండులా ఉంది. బొద్దుగా ఉన్నప్పటికీ పొడుగ్గా ఉంది. పొడుగ్గా ఉండడమే కాకుండ అందంగా ఉంది. అందంగానే కాకుండ చాలా నాజూగ్గా ఉంది. నాజూగ్గానే కాకుండ కళగా ఉంది.

మంచిగా కూడా ఉంది. ఆమెకీ




మూర్తిగారికీ వివాహం జరిగి తొమ్మిది లేక పదిసంవత్సరాలై ఉండవచ్చు. అతడప్పుడు మెడిసిన్ చదువుతున్నాడు. త్వరలోనే పాసయ్యాడు. పాసయ్యాక మరి రెండేళ్ళకే మాస్టర్ ఆఫ్ సర్జరీ ఫస్టుక్లాసు సంపాదించాడు. సంపాదించేక ఉద్యోగం అనవసరమని పించిందతనికి. అసిస్టెంట్ సర్జనుగా ఎన్నాళ్ళు రాట్ అవ్వాలి. ఎందుకది? తనేం లేనివాడు కాదుకదా? ప్రైవేటు ప్రాక్టీసు పెట్టుకుంటే అదృష్టం బాగుంటే...

మూర్తి డాక్టరుకి అదృష్టం బాగుంది. ఆయనక్లినిక్ పెట్టుకున్న కొద్ది రోజుల్లోనే సర్జరీలో (శస్త్ర చికిత్స) అఖండుడని పేరుతెచ్చు కున్నాడు. అతని చేతులు చల్లని చేతులని అతని కత్తికికూడా వైద్యం వచ్చని అతను చావుని చంపగలడని ప్రజలంతా ఏమేమో చెప్పుకుంటారు. అతను బట్ట ఎంత కరెక్ట్‌గా తీసుకొంటాడోపని అంత ఖచ్చితంగా చేస్తాడని అందరికీ బాగా తెలుసు.

పెద్దాసుపత్రిలో కూడా అంతటిడాక్టరు లేడట. మరింక జిల్లాకి అతనే రాజు. అదృష్టమంతా ఆయన భార్యదట. లక్షీకళంతా ఆవిడలోనే ఉందట. పదేళ్ళయి పెళ్ళయినా నిన్నే పెళ్ళయినట్టు ఉంటుందట. ఇద్దరు పిల్లలు చక్కగా ఒక కొడుకు ఒక కూతురు. ఉన్నారని ఎవరూ అనుకోరట. కొడుకుని చక్కా సైనిక్ స్కూల్‌లో వేయించారట. కూతురిని ఆ పిల్ల తాత ఒగ్గల్లు తీసుకెళ్ళి తన దగ్గర పెట్టుకొన్నాట్ట. మనవరాలంటే ఆ బాబుకి అంతమోజు.

లక్ష్మి దేవిలాంటి భార్యవేపు ఓసారి చూసి తలదించి పొర్కుస్పూను సర్దుకుంటూ, "సో, డార్లింగ్ ఏమిటి సంగతులు?" అనడిగాడు డాక్టరుమూర్తి.

డాక్టరుగారి భార్య ఏదో జవాబు చెప్ప బోతూంది. అంతలోనే ఆగదిలోకి ఆయాలా కనపడే "ఆడబంట్రోతు" ఒకామెవచ్చి

"బాబు ఎవరో పేషెంటు వచ్చారు". అని సమాచారం చెప్పింది.

"ఎవరో పేషెంటట. సంగతేమిటని అడిగారు కదా. అవే సంగతులు ఇంకేముం టాయ్!" అంది డాక్టర్ భర్తతో భార్య శ్రీలక్ష్మి. మూర్తి డాక్టరుకి కోపం వచ్చింది.


భార్యని చూసికాదు. ఆయాని చూసి. భోజనం చేస్తుంటే పేషెంట్ల సంగతి చెప్పొద్దని నీకెన్ని సార్లుచెప్పాను. పేషెంట్లు వస్తే నేను భోజనం చేసే దాక కూర్చోమని చెప్పలేవూ? ఈడియట్" అని కసిరేడు మూర్తి డాక్టరు.

కసురుపుచ్చుకుని ఆయా బయటకి వెళ్ళిపోయింది. డాక్టరు మూర్తి వెంటనే చిరునవ్వునవ్వేడు సతీమణివైపు తిరిగి. అందు గురించే అతని సతీమణి ఆశ్చర్యపోతూ ఉంటుంది. అక్షణంలో అంతభయంకరంగా గర్జించి మరుక్షణంలో అతను అంత మనో హరంగాఎలామందహాసం చెయ్యగలడా అనే విషయం ఆమెకి ఈ తొమ్మిది పదేళ్ళయి కూడా అర్థం కాకుండ ఉంది.

"డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్‌లా మీరు ఎలా ఉండగలరండీ" అని ఆవిడ ప్రశ్నించింది.

భార్య ప్రశ్నకి పకాల్‌మని నవ్వేడు.

"క్రిందివాళ్ళతోను, మనవాళ్ళతోను ఒక్క లా ఎలా ఉండగలం లక్ష్మీ. కింది మనుషుల్తో కర్కోటకంగా హెచ్చెట్లర్లా వుండకపోతే లాభం లేదే. తినేరూ మనల్ని. మనవాళ్ళతో ఒకలా ఉండాలి. వాళ్ళతో ఇంకోలా ఉండాలి. మనలెవిల్‌వేరు. వాళ్ల లెవిల్ వేరు. తక్కువ్వాడి దగ్గర మన ఎక్కువతనం చూపించక పోతే వాడుమనకంటే ఎక్కువ్వాణ్ననుకుంటాడు. అందుచేత మనం ఎవరి లెవిల్లో వాళ్ళని ఉంచాలి. నా పాలసీయే అది."




అంటూ నవ్వుతూనే నిజజీవితంలో తను పాటించే నిత్యసూత్రం భార్యకి తెలియజేసాడు మూర్తి డాక్టరు.

"మంచిగాను మర్యాదగాను ఉండటానికి లెవిల్స్ ఎందుకండి. ఏమిటో మీ ప్రవర్తన నాకర్థం కాదు" అని భార్యకూడా భర్తలాగే భోజనానికి ఉపక్రమించింది. భర్త గారు భోజనరంగంలో పూర్తిగా దిగిపోయే ఉన్నారు.

భూప్రపంచంలో కొన్ని మంచి ఆహార పదార్థాలు తిరుబాటుగా ఖర్చు చేసేక కుర్చీ లోంచి లేచి వెళ్ళి మూతిని చేతినీ కడుక్కుని మూర్తిగారు తువ్వాలుతీసి తుడుచుకొంటూ వచ్చి భార్య భోజనం ఇంకా పూర్తికాలేదు కాబట్టి ఆమెకిఎదురుగా మళ్ళీ కూర్చో బోయేరు. కానీ ఆమెవారించింది.

"పేషెంటు ఎవరో పాపం! వచ్చేరట వెళ్ళిచూడండి." అంది భర్తతో ఆమె. భర్తమూర్తి అయిష్టంగా అవతలకి వెళ్ళేడు మరొకపది నిమిషాలకి డాక్టరు గారి భార్య కూడా భోజనం పూర్తి చేసి ముందు హాల్లోకి వచ్చేసరికి రాత్రి పదకొండు దాటింది.

(వాళ్ళవిలాస గృహాల్లో తప్ప) పెద్దింటి వాళ్ళ దీపాలన్నీ ధగధగలాడతాయి. మూర్తి డాక్టరుగారి ముందుగది దీపం అమాదిరిగానే ఉంది. ఆయన భార్య అక్కడికి వెళ్ళేసరికి మూర్తిగారు ముఖం ముడుచుకుని చిరాగ్గా నిలుచున్నారు. ఆయనెదురుగా వీధిగుమ్మం వారగా ఓ నడికాలపు మనిషి వినయంగా నిలుచున్నాడు. వినయంగా ఉన్నాడు కాని అతన్లో తొందర కనిపిస్తోంది తలమీదపాగా కనిపిస్తోంది. ముడుకులు దాక ఎగ్గట్టిన పంచెమీద పొట్టిచేతుల కద్దా కనిపిస్తోంది. చేతుల నిండా మట్టిపారలు కనిపిస్తున్నాయి. చేతుల్ని గుండె మీద కట్టుకుని విప్పి అర్థించిన ట్టుగా ముందుకు చాచి మళ్ళీ కట్టుకుని గాభరాగాభరాగా మాట్లాడ్డంతో తొందర భయమూ ఆవేదనాకనిపిస్తున్నాయి.

అతను బలంగానే ఉన్నాడు. కాని అంతగా ఆరోగ్యంగా ఉన్నట్టుగా లేడు. ముక్కుఎత్తుగా ఉంది కళ్ళు మెరగ్గా, ఎర్రగా ఉన్నాయి. చెవుల్ని ఎర్రపొళ్ళు దుద్దులున్నాయి. మాడిన రాగిబిందె రంగులో ఉన్నాడతను అతనికి ముప్పయ్యేళ్ళే వయసంటే ఎవరిక యినాసరే నమ్మకం కలక్కపోవచ్చు. నలభై

ఏళ్ళు దాటిన వాళ్ళా ఉన్నాడతను.

మనిషిని ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఓసారి చూచి మళ్ళీ జబ్బుగా ఉన్నప్పుడు చూస్తే పోల్చలేక "ఇతన్నెక్కడో చూసినట్టుందే" అనుకున్నట్లుగా అతడ్ని చూసి ఆవిధంగా అనుకొంది డాక్టరు గారి భార్య.

"బాబుగారు! నాకో ఎకరామడి సెక్క మిగిలింది. అది అమ్మేనయినానరే మీ ఋణం తీర్చుకొంటాను. ఎంతయినా ఇస్తాను. మా అమ్మని తమరెలాగయినా రక్షించాలి తమరు తప్పమరెవరూ బతికించలేరట. ఆపరేషను వేగిరం చేస్తేనే కాని మనిషి బతక దట. ఆచీటీ మాఊరి డాక్టరుగారు తమరికి ఇమ్మని ఇచ్చేరు."

అని చెప్పున్నాడతను.

ఆచీటి అప్పుడే చదువుకొన్నారు మూర్తి డాక్టరుగారు. ఆచీటి మళ్ళీ ఆ ఆసామికి ఇచ్చేసారు. ఆ ఆసామి చీటి తీసుకుని డాక్టరు గారివైపు ఎర్రకళ్ళతో బరువుగా ప్రశ్నార్థకంగా చూసేడు. "చావా? బతుకా? అనేది ఆ ప్రశ్న.

మూర్తిగారు చిరాగ్గా ముఖం పెట్టడంతోనే అవతల ఆసామికి వారి జవాబు తెలిసి పోయింది. కాని ఆశ అంతరిస్తూ కూడా ఆశగాఅడుగుతుంది.

"ఏం! బాబు, ఏంశలవు? అనిఅడిగే డతను. మూర్తి డాక్టరు ఆ ఆసామివైపు వీపు తిప్పి భార్యవైపు నడుస్తూ" మీ అమ్మా? ఎవరావిడ? ఆవిడొచ్చిందా?" అనడిగేరు. "బండిలో వేసి తీసుకొచ్చేను బాబు? బండిలో ఉంది అని జవాబు చెప్పేడతను.

"అయితేనేచెప్పినట్టు చెయ్యి. ఆవిడ్ని ఆసుపత్రికి తీసుకెళ్ళు"

"ఆసుపత్రిలో తమరంత మంచి చెయ్య లేదట బాబు"

"లేకపోతే ఏం చేస్తాం?"

అని భార్య దాకా వెళ్ళి అక్కడనిలుచుని ఆ ఆసామివైపు తిరిగేరు డాక్టరుగారు. ఆ తరువాత తన ఉద్దేశం ఏమిటో అతనికి స్పష్టంగా చెప్పేసేరు.

"నువ్వు బీదవాళ్ళా ఉన్నావు. అవునా? అవును. అటువంటప్పుడు నువ్వునా ఖరీదు ఇచ్చుకో గలవా? ఇచ్చుకోలేవు. ఇంత ఖరీదంటావా? ఎంతయితే నీకెందుకు? నువ్విచ్చు కోలేనంత సరిపోయిందా? మీ ఊరి డాక్టరు నువ్విప్పుడు ఏమీ ఇచ్చుకోలేవని తరువాతె ప్పుడో ఇస్తావని రాస్తున్నాడు అంచేత తిన్నగా జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్ళు. అక్కడ డ్యూటీలో ఎవరో ఒకరుంటారు."

అని డాక్టరుగారు చెబుతుండగా ఆనాటు మనిషి గబగబా ముందుకొచ్చి డాక్టరుగారి కాళ్ళ మీదపడబోయేడు. డాక్టరుగారు వెనక్కి జరిగేరు

"బాబ్బాబు" అని ప్రాధేయపడ్డాడు ఆ ఆసామి.

"ఇస్! లేలే, లే " అని మూర్తి డాక్టరు కేకలు వెయ్యగా ఆ ఆసామిలేచాడు.

అప్పుడుమూర్తిడాక్టరు చాలా శాంతంగా చెప్పేరు.

"ఓయ్! నాయుడు! నేచెప్పేది శ్రద్ధగా విను మీ అమ్మకి ఉన్న జబ్బేమిటి ఆ చీటిలో డాక్టరుగారు రాసేరు. అందుగురించి అర్జంటుగా ఆపరేషను చెయ్యాలి. అర్జంటుగా అంటే నా కిప్పుడు వీలుపడదు. నేనిప్పుడు అర్జంటుగా మరొక ఆపరేషన్‌కి వెళ్ళాలి. నువ్వు రాకముందే నేను ఆ ఆపరేషన్‌కి వప్పుకొన్నాను. అంచేత వెళ్ళు. వేగిరం వెళ్ళు హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రికివెళ్ళు. వేగిరం వెళ్ళు."

అని అతడ్ని తొందరచేసి బలవంతంగా

ఇంట్లోంచిపంపించేసేరు మూర్తి డాక్టరుగారు. వీధి తలుపు చేరవేసి వెనక్కి తిరగి భార్యవైపు చూసేరుమూర్తిగారు. ఆవిడసోపాలో కూర్చొని ఏదో ఆలోచిస్తూంది.

"ఎపెనీ ఫర్ యువర్ థాట్స్" అన్నారు మూర్తి డాక్టరు ఆవిడ ఆలోచన లోంచి బయటపడి.

"అతన్ని ఎందుకలా పంపించేసారు? తప్పు కదూ"? అంది.

"ఉచితంగా చెయ్యడానికి నేనేం ప్రేమ సమాజవాద్ని కాదు. వాళ్ళయినా వాళ్ళు చేసే పనికి మరెక్కడినుంచో డబ్బు గుంజుతారు.' అని కొంచెం చిరాగ్గా అన్నారు మూర్తిగారు భార్య మాటకి జవాబుగా

"అతనైనా ఏదో ఇస్తానన్నాడుగా" అంది భార్య "ఎప్పుడో ఇస్తాట్ట. అదయినా నేనడిగి నంత ఇవ్వలేడు ఇచ్చుకోలేడని వాళ్ళ ఊరి డాక్టరు అరికమండేషన్ లెటర్లో రాయనే రాసేడు. ఆపాటి దానికి నేనెందుకు కష్టపడాలి. నాకు దేముడు ఓరకం శక్తి ఇచ్చేడు ఆశక్తిని నేను నా ఇష్టం వచ్చినంత ఖరీదుకి నా ఇష్టం వచ్చిన వాళ్ళకి అమ్ముతాను. ఇందులో అన్యాయం అదర్మం అటువంటివేమీ లేవు. తెలిసిందండీ మేడమ్ లాయర్ శ్రీ కంఠరావు గారి అమ్మాయివైయుండీ కూడా ఆపాటి లాజిక్ తెలుసుకోలేదా నువ్వు"

అని నవ్వుతూ ముగించేడు మూర్తి డాక్టరు.

శ్రీలక్ష్మి ఏమీ మాట్లాడలేదు ఆమెనిట్టూర్చింది.

మూర్తి డాక్టరు లోనికెళ్ళి దుస్తులు మార్చుకుని హాల్లోకి వచ్చాడు శ్రీలక్ష్మి ఇంకా సోఫాలోనే కూర్చుని ఉంది.

"చాలా లేటయిపోయేను. వెళ్తాను" అన్నాడు మూర్తి డాక్టరు

"ఎక్కడికి అన్నట్టు ముఖం పెట్టింది శ్రీలక్ష్మి.

' 'ఆపరేషనుకని చెప్పేనుకదా. ఆపరేషన్ కార్డ్స్ ఈ పాటకి మా ఫ్రండ్సుంతా ఫుల్‌స్వింగ్‌లో ఉంటారు అని తొందరగా చెప్పేసిపేకాటకి పయనమయ్యేడు మూర్తి డాక్టరు. అప్పటికి రాత్రిపదకొండున్నర దాటింది.

***

రాత్రిపదకొండున్నర దాటింది. పదినించీ కూడా వర్షం తెగ జోరుగా పడుతోంది. "ఏనుగు తొండలా లేక రక్కసి కుండలా" అనిపించే టంత హడావుడిగా పడుతోంది. వర్షధారలు పెట్టే చిరాకువల్ల కాబోలు గాలికి పిచ్చెక్కి



నట్టుగా ఉంది.వర్షపుధాటికి, పిచ్చిగాలికి భయపడి కుచించుకుపోయి కాబోలు చీకటి మరీ చీకటిగా ఉంది. కొండల మీద మంచుగడ్డలన్నీ గాలిగా మారిపోయి కాబోలు. చీకటి మరీ చీకటిగా ఉంది. కొండలమీద మంచుగడ్డలన్నీ గాలిగా మారిపోయి కాబోలు. చలికొరుక్కుతినేస్తుంది. కొండలు కూడా గజగజలాడివజవజ వణికేటంత చలిగా ఉంది. తోటల్లోను, పైరుల మీద పాకలపైన గాలివానా చేసే చప్పుడు యమదూతల అరుపుల్లా రక్కసి నక్కల ఊళల్లా భయంక రంగా ఉంది. ఇనపగోడల మధ్య కూర్చున్న ప్పటికీ ముక్కుకి నీటి వాసన గుప్పుమని తగిలేటంత ఫోర్సుతో ప్రవహించే ఆ గాలివాన ఆ రాత్రిని రౌద్రంగా చెండాడిపోతుంది. చీల్చుకు మరీ పోతుంది.

ఊరుకీ రోడ్డుకీ మధ్య సుమారు మైలు దూరం ఉంది. ఈ మధ్య దూరంలో అన్నీ పొలాలే. రోడ్డెక్కేవ్ ఆ రోడ్డంట ఓ రెండు ఫర్లాంగులు దక్షిణంగా నడిచి రోడ్డుకి అవతల పక్కకి దిగితే దాసుగారి పదెకరాల పొలం ఉంది. ఆ పొలం ఓ వారకి వారి కళ్ళం ఉంది.

ఆ రాత్రి ఆవానలో ఆ ఊరికీ ఆ రోడ్డుకీ మధ్య పొలాల గట్టంట ఓ మానవాకారం వెళ్తోంది. రోడ్డుముఖంగా వెళుతోంది. (మధ్య కత్రతీసెసిన) తాటాకుల గొడుగుని నెత్తిన పెట్టుకుని రెండు చేతులతోనూ దాన్ని అదిమి పట్టుకుని ముందుకి వంగి గాలినీ, వాననీ ఎదిరిస్తూ జోగుతూ వెళుతోంది. కారు మబ్బు లు వెర్రిగా నవ్వినప్పుడు ఆ ఆకారం బితుకు బితుకుమని కనిపిస్తోంది. కారు మబ్బులు వెర్రిగా నవ్వినపుడు కారు చీకట్లో కలిసి పోతుంది ఆ ఆకారం.

దాసుగారి కళ్ళంలో పశువులపాకలో కొన్ని పశువులున్నాయి. వాటికి పరవాలేకపోవచ్చు కాని కళ్ళంలో పందిరికింద కొన్నిపశువులుండి పోయాయి. దాసుగారి ఇంట్లో పని చూసుకొని తనగుడిసెకు వెళ్ళి గంజి నీళ్ళు తాగి దాసుగారి కళ్ళంలోకి వారిపాలె గాపు నరసయ్య పయన మవ బోతుండగా వర్షం పట్టుకుంది. వర్షం ఆరంభం అవగానే నరసయ్య తన గుడిసె నుంచి దాసుగారి లోగిల్లోకి పరిగెట్టాడు.

"పందిరికింద పశువులుండిపోయాయి కదరా నరసయ్య" అన్నారు దాసుగారు.

"చిత్తం" అన్నాడు నరసయ్య.

మరయితే ఏం చేద్దాం" అనడిగేరు దాసుగారు.

వర్షం తగ్గుతుందేమో చూద్దాం" అన్నాడు పాలెకాపు. తగ్గలేదు వర్షం. మరయితే వెళ్ళి ఆ పశువుల్ని పాకలో కట్టకపోతే "అవిసస్తాయే' ' అని చెప్పి బుగత దగ్గర బెట్రీ దీపం తీసుకుని తనది కమ్మల గొడుగు పట్టుకుని బయల్దేరాడు నరసయ్య.

బేట్రీ దీపాన్ని మొల్లోపెట్టుకున్నాడు. కాని దాన్ని తియ్యడానికి వీల్లేకపోతోంది నరస య్యకి. దీపం ఓ చేత్తో తియ్యాలంటే రెండో చేతిలో గొడుగు ఉండకుండా ఉంది. చాలా భయంకరంగా ఉంది గాలి. తడిసి ముద్దయి పోయాడు చలికి గజగజ వణుకు తున్నాడు. చిన్నతనంనించీఅలవాటయినదారే కాబట్టి ఎంత చీకటిగా ఉన్నా ప్రదేశం అంతా ఎంత జలమయమై ఉన్నా అతని అడుగు మాత్రం అనిక మీద మామూలు దారిలోనే పడుతోంది.

చెవుల్ని పూర్తిగా కప్పిన తలపాగా ఆ వర్షపు తుంపరకి నాని బరువెక్కుతోంది. గుండెల్ని కప్పిన చింకి కబ్బా వర్షపు జల్లుకి పూర్తిగా తడిసి ముద్దయిపోయింది. ధారలు కారే నీటి బరువుకి పంచె బరువుగా కిందికి దిగలాగుతోంది. చలికి నరాలు తోడేస్తున్నాయి. వేళ్ళు కొంకర్లు పోతున్నాయి. పై వరస పళ్ళని కింది వరసవి టక టక మని కొడుతున్నాయి.

ఆ సమయంలో నరసయ్య దేని గురించి ఆలోచిస్తున్నాడు? ఖూనీ కేసులో ఇరుక్కుని జైల్లో చచ్చిన తండ్రి గురించా? సమయానికి సరైన వైద్యుడి సహాయం చిక్కక చనిపోయిన తల్లి గురించా? అమ్ముడయిపోయి అపహరింపబడిపోయి పరహస్తాల్లోకి పోయిన తన బీద భూముల గురించా? బుగత గారి పొలాల్లో కూలి కాపు చేసే తన భార్యాపుత్రుల

గురించా? ముక్కచెక్కలయి పోయిన తన మొత్తం బతుగ్గురించా? చీకాకు పరిచే చినుకుల గురించా? గజగజలాడించే చలి గురించా?

తొందరగా కళ్ళానికి చేరుకుని అక్కడ పందిరి కింద సొమ్ముల్ని పాకలో కట్టేసి తొందరగా ఇంటికి వచ్చి మంచంకింద "కుంపటెట్టుకుని తొంగుంటే గానీ ప్రాణం నిలబడకపోవచ్చునని అతను మరికొంత తొందరగా అడుగులు వేసాడు. మెరుపు మెరిసినప్పుడల్లా భూమాత అంతా శివాలెత్తినట్టు కనిపిస్తోంది. చేలూ, చెట్లూ అన్నీ కూడా సుళ్ళు తిరుగుతున్నాయి.

గట్లన్నీ దాటి రోడ్డెక్కే సమయానికి నరసయ్యకి ఓ అనుమానం కలిగింది. ఈ గాలికి కళ్ళంలో పశువుల పాక "ఉంటదా? ఎగిరి పోద్దా?" అని అనుమానం కలిగేసరికి అతని గుండె గుభేలుమంది.

"సొమ్ములన్నీ ఏటయిపోయుంటాయో ఎటో? అని అతను మరికొంత తొందరగా నడక సాగించేడు అతని తొందరలో అతను ఉండటం చేత అంతా అయిపోయేదాక ఏం జరిగిందో అతను సరిగ్గా చూడనైనా లేదు.

గాలిహోరులో దాని హోరు కలిసి పోయింది. ఒక్కసారిగా ఎక్కడనుంచో వెలుగొచ్చింది. ఆ వెలుగులో ఆ వర్షపుధారలు చిక్కపడి పోయిన బంగారపు నారలా మిల మిల మెరిసేయి. మెరుపైతే అది "ఇంతసేపు ఉంటదా"? అని అతను ఆశ్చర్యపడేలోపునే పిడుగులా ఓ పదార్థం శరవేగంతో అతన్ని దాటుకుని వెళ్ళిపోయి పెళపెళ విరిగింది.

నరసయ్య పరిగెట్టాడు. రోడ్డుమీద ఓ వంద గజాల దూరం పరిగెట్టాడు. చేతిలో ఉన్న గొడుగు అతన్ని విడిచి రయిమని వెనక్కిపోయి వెల్లకిలా పడిపోయి వీపుమీద దేకురుకుంటూ వెళ్ళి రోడ్డు పైడుగా ఉన్న ఓ పాక పక్క చెట్టుమానుకి చీకట్లో చేర్లబడింది. నరసయ్య గాలి కెదురీతగా పరిగెట్టి కుడిపక్క రోడ్డంచు నుంచి కిందికి దిగిపోయి ఊపు ఆపుకొని చూసేడు.

దెయ్యంలా ఏదో పడుంది. దాని కడుపు లోంచి బయటకి రావడానికి ఓ మానవాకారం కాబోలు గిజగిజలాడుతోంది. గట్టుదిగుతుండగా నరసయ్యకి గుర్తుకొచ్చింది. తన దగ్గర బేట్రీ దీపం ఉందని అదితీసి చేతిలో సవరించుకొని మీటనొక్కాడు. దీపం వెలుగులో ఆకారు చాలా అసహాయంలా వెల్లకిలా పడిపోయిన గున్న ఏనుగులా కనిపిస్తోంది.




అందులోను అదొకపక్కకి ఒరిగిపోయి ఉంది. ఇవతల పక్క ఓ తలుపు తెరచుకుని వెళ్లాడుతోంది. అందులోంచి గిజగిజామని ఓ ముసలి మనిషి పైకి వచ్చి పైకి రావడానికే శక్తంతా ఖర్చయిపోవడంచేత కాబోలు రాగానే టుపుక్కు మని కిందని చతికిలబడిపోయాడు.

బేట్రీ దీపం వెలుగులో నరసయ్యకి డెబైఏళ్ళ ముసలితనం నలిగిన జరీకండువా మెరుపుతనం ముఖంలో పండుతమలపు తెలుపుతనం కనిపించేయి. "చచ్చిపోలేదుకదా' ' అనుకుని ముందుకి వెళ్ళేడు నరసయ్య అతను చచ్చిపోలేదు. ఆమె కూడా చచ్చిపోలేదు. స్పృహతప్పిపోయి కార్లోనే ఉంది. ఆవిడ్ని బైటకి నరసయ్యే లాగాడు. ఆవిడ లేత గులాబీ ముఖం నెత్తురుతో తడిసిఉంది.

కారే నెత్తురు ఆమెకట్టుకున్న ముదురు గులాబీ రంగు చీరమీదకి జారుతోంది. మంచుముక్కల్లా పడే చినుకులకి పులి కన్నులా వెలిగే టార్చిలెక్కీ ఆవిడ కళ్ళు విప్పింది. నరసయ్య తన తలపాగా లాగి ఆమె ముఖం తుడిచేడు. నుదుటి మీద గాయం ఒక్కటి మాత్రం ఉంది. పాగా గుడ్డ చింపి గబగబ ఆమెకి కట్టుకట్టాడు నరసయ్య.

ముసలాయనకి ఏదెబ్బాలేదు. గాబరాతోను, భయంతోను ఉన్నాడు. ఆ ఆడమనిషి అతని కూతురయినట్టుంది. ఆవిడ గురించి అతను "అయ్యో అయ్యో" అని అస్పష్టంగా అరుస్తూ అదేదో దెబ్బతిన్న పశువులా ఏడుస్తూ కూర్చున్నాడు. వర్షపు చప్పుళ్ళో అతని గోల నరసయ్య చెవినపళ్ళేదు.

ఆవిడకి దగ్గర దగ్గర నలభై ఏళ్ళుంటాయి గాని ఆవిడ అందంగా సౌమ్యంగా ఉందని గాని ఆవిడ మెడలో బంగారానివీ, వజ్రాలవీ నగలున్నాయనిగానీ నరసయ్య గమనించలేదు. ఆవిడ అటూఇటూ చూస్తూ ఏదో అడుగుతోంది.

"ఆయనేరీ"

ఆమాట ఏమిటో వినపడ్డం లేదు. అంచేత ఆవిడనోటికి తన చెవిఆన్చి విన్నాడు నరసయ్య. తనభర్త గురించి అడుగుతుంది ఆవిడ. కారు ఒదిగిన పక్క అటుపక్క కారుకింద మరోమనిషి నలుగుతున్నాడని దీపం వెలుగులో పరికించి చూచి అప్పుడు తెలుసుకున్నాడు నరసయ్య. ఆ ఆసామిని కారునెమ్మదిగా నెమ్మదిగా కిందికి నొక్కుతోంది. నరసయ్య చటుక్కున లేచినిలుచున్నాడు. ఆ ఆడమనిషి పెనిమిటి అంత ప్రమాదమైన పరిస్థితిలో ఉన్నాడని తెలిసేసరికి ముసలాయనా ఆ ఆడమనిషి కూడా లేచినిలుచున్నారు. నిలుచున్నావాళ్ళు నిలువు నాకుప్పకూలిపోయి నరసయ్య కాళ్ళ మీద పడ్డారు. "నువ్వే దేవుడివి అతన్ని రక్షించుకాపాడు. మా పాలిట దేవుళ్ళా వచ్చావు రక్షించతన్ని రక్షించు" అని వాళ్ళంటున్నారు.

వాళ్ళ మాటలు నరసయ్యకి వినిపించలేదు. టార్చివెలుగులో చూస్తే వాళ్ళ మొహాలే వాళ్ళ భావాలని తెలియచేస్తున్నాయి. ఆ వెలుగులో వాళ్ళ ఆకారాలుఅతనికి గుర్తుకురానే వచ్చాయి. వాళ్ళ మాటలతనికి వినిపించలేదు. వినిపించుకునే స్థితిలో లేడతను.

దేవుడు బతుకిచ్చేడు శక్తిచ్చేడు. సమాజంలో అతనికి గడిచిన కాలంలో ఆ బతుకు బండరాళ్ళ పాలయ్యింది. ఆశక్తి సన్నగిల్లింది కాని మిగిలిన శక్తినంతా ఎడమ భుజానికి దండకి తెచ్చుకుని ఆ ఒదిగే కారుని నిలబెట్టి ఒక్క ఊపూపి ఆ కారు కింద నాక్కుక్కుపోయే మూర్తి డాక్టర్ని కుడిచేత్తో బయటకి లాగేడు నరసయ్య.

ఆ పరిస్థితిలో వాళ్ళ మాటలతనికి వినిపించలేదు. కాని వాళ్ళభావం మాత్రం అతనికి తెలియకపోలేదు. రక్షించమని ప్రార్థిస్తున్నారు వాళ్ళు తనని.

ముసలిప్లీడరుగారి ఏడుపు ప్రార్థనలకి గానీ, కూతురమ్మకాబోలు"ఆవిడవేడుకునే ఏడుపుకి గానీ ఏమయినా, ఏదైనా సమాధానం ఇద్దామని అప్పుడనిపించలేదు నరసయ్యకి.

ఆ తరువాత డాక్టరు మూర్తిగార్ని అతడు భుజాన వేసుకుని............


ఆ అర్ధరాత్రి ఆ గాలివానలో ఆ సమయంలో ఆస్థలంలో అక్కడవాళ్ళు తప్ప ఇంకెవ్వరూలేరు. మూర్తి డాక్టర్ని మోసుకెళ్ళే శక్తి ఆయన భార్యకీలేదు. ముసలిమామగారికీ లేదు మరంచేత.....

మూర్తి డాక్టర్ని మూపున వేసుకొని ఓచేత్తో శ్రీలక్ష్మిని పట్టుకుని నడిపిస్తూ ఆవిడ తన ముసలి తండ్రి చెయ్యి పట్టుకు నడిపించుకొని తన వెంటరాగా అక్కడికి అల్లంత దూరంలో చెట్లతోపులో రోడ్డుప్రక్కనే ఉన్న పాకదాక నడిచి అక్కడ గడ్డిపరచి మూర్తి డాక్టర్ని పడుకోబెట్టి" అతను చావుబతుకుల మధ్య ఉండవచ్చునెమో గానీ ఇంకా బతికే ఉన్నాడు. బతకవచ్చు కూడాను" అని గ్రహించి అప్పుడనుకున్నాడు నరసయ్య.

మిమ్మల్నినేనెందుకు రక్షించాలి? మీచావు బతుకుల మధ్య దూరి నలిగి మిమ్మల్ని బయిటికి బతుకులోకి నేనెందుకు లాగి మీకు సాయపడాలి? మీకు నేను సాయపడను. మిమ్మల్ని చస్తే రక్షించను. సమయంలో నేను తప్ప మీకు మరో దేవుళ్ళుడు మనిషిలేడు. మిమ్మల్ని రక్షించే శక్తి ఇప్పుడు ఇక్కడ నాకుంది. మీ ఇల్లూ మీ మేడలు మీధన కనక వస్తు వాహనాలు, మీ సంసారాలు కడిగేసి ఊడ్చేసి మీ మాన ప్రాణాలతో సహా మీసర్వం సమస్తం నాకు సమర్పిస్తారా?

సమర్పిస్తేనే సాయం చేస్తాను. లేకపోతే చెయ్యను. నా శక్తికి నా యిష్టం వచ్చిన విలువ కట్టుకుంటాను అదిస్తేనే మీకు నా సాయం. లేకపోతే లేదు. అవునంతే. నేనేం తప్పుచేసాను. నేనేం తప్పుచెయ్యలేదు. మీరు నా విలువ నాకివ్వలేరా? ఇవ్వలేకపోతే ఊళ్ళోకి వెళ్ళి ఇంకోణ్ణి తెచ్చుకోండి"

## కందుకూరి శ్రీరాములుకు "ఉమ్మడి శెట్టి సాహితీ అవార్డు"



1994వ సంవత్సరానికి గాను "ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు" ప్రముఖకవి కందుకూరి శ్రీరాములు గారికి లభించింది. న్యాయ నిర్ణేతల తీర్పు ననుసరించి ఆయన రచించిన "వయొలిన్ రాగమో, వసంతమేఘమో" కవితా సంపుటి ఎంపికైందని అవార్డు వ్యవస్థాపకులు శ్రీరాధేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అవార్డు న్యాయ నిర్ణేతలుగా - డా॥ నందిని సిద్ధారెడ్డి, కొత్తపల్లి, రవిబాబు, డా॥ జూపల్లి ప్రేమ్ చంద్ గార్లు వ్యవహరించారని ఆయన వివరించారు.

ఆ చీకట్లో అటువంటి ఆలోచనలేవో అస్పష్టంగా నరసయ్య మనసులో మెదిలాయి. అలా మెదలడమే అతనికి సిగ్గనిపించింది.

"ఛా! తప్పు" అనుకున్నాడతను.

మర్నాడు మధ్యాహ్నం ఊరి బుగత దాసుగారి లోగిలి ముందు మరో కారు ఆగింది. వర్షం బాగా వెలిసింది. ఎండ బాగా కాస్తోంది. మూర్తి డాక్టర్ని మరో డాక్టరు వచ్చి చూసి ప్రమాదావస్థ దాటుతుందని నమ్మకంగా చెప్పి దగ్గరుండి ఆయన్ని కార్లో వేయించేడు. తిరుపతి (కార్లో) వెళ్ళి వస్తుంటే ఆపదవచ్చినా ఆ వెంకటేశ్వరుడే నరసయ్య రూపంలో వచ్చి ఆదుకున్నాడని అంతా అనుకున్నారు.

శ్రీలక్ష్మి శ్రీకంఠరావు కారెక్కబోతూ చుట్టూ ఉన్నజనాన్ని పరికించి చూసేరు. శ్రీకంఠరావు నరసయ్యని గమనించి దగ్గర కొచ్చి ఏడుస్తూ తన కృతజ్ఞత తెలియచేసారు. నిజంగా మేము నీ ఋణం తీర్చుకోలేం. కాని నీకేం కావాలో చెప్పు ఇవ్వగలిగిందేమైనా సరే ఇస్తాను. చెప్పరానాయనా చెప్పు" అన్నాడు.

ఊరి బుగత దాసుగారు ఊరిజనం అందరూ కూడా నరసయ్య వైపు కుతూహలంగా "ఏమడుగు తాడేమడుగు తాడు" అన్నట్టుగా చూసేరు. నరసయ్య ఏమీ అడగలేదు. నిట్టూర్చి అక్కడినించి వెళ్ళిపోయేడు.

మీరేమివ్వగలరు?

పోయిన తండ్రినివ్వగలరా?

చచ్చిన తల్లినివ్వగలరా?

మసిగా మారిన బంగారపు బతుకు నివ్వగలరా?

ఏమివ్వగలరు?

ఏమీ ఇవ్వలేరు.

★

